
# మహానగరం కథలు
## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా,  తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ,  స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే  జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు..  ఈ మహానగరం కథలు..!!

# నిర్ణయం

“శీశీ..” అన్న పిలుపు విని తీయబోతున్న తాళాన్ని అలాగే ఉంచి వెనక్కి తిరిగి చూసింది శిశిర.

అక్కడ చేతిలో కవర్ పట్టుకుని నిలబడి ఉన్న జయంతి ని చూడగానే, "రండి ఆంటీ, ఇప్పుడే వచ్చాను, కలిసి కాఫీ తాగుదాం” అంటూ తాళం తీసింది.

" నీకు రిజిస్టర్ పోస్ట్ లో వచ్చింది, నువ్వు ఆథరైజేషన్ లెటర్ ఇచ్చావు కనక తేలిగ్గా ఇచ్చాడు, లేకపోతే ఇచ్చేవాడు కాదు తెలుసుగా మన పోస్ట్ మాన్ సంగతి” అంటూ గల గలా మాట్లాడుతూనే శిశిర తో పాటు లోపలకి వచ్చింది జయంతి.

“కూర్చోండి ఆంటీ, కాఫీ మేకర్ ఆన్ చేసి వస్తాను, మంచి కాఫీ తాగుదాం” అంది, చేతిలోని ప్లాస్టిక్ బాగ్ లోంచి పాలూ, పెరుగు పాకెట్లూ, కూరల సంచీ డైనింగ్ టేబిల్ మీద పెడుతూ.

" తొమ్మిదవుతోంది, ఇప్పుడేం కాఫీ? భోజనాల టైమవుతూంటే? ”అంది జయంతి.

" అలా అంటారేం? ఫలానా టైముకే ఈ పని చెయ్యాలని ఎవరు చెప్పారు? మనమే కదా, దాన్ని కొంచం అటూ ఇటూ మార్చుకోవడం మన చేతిలో పనేకదా!” అంటూ నవ్వింది శిశిర.

" సరే నీ ఇష్టం, మీ అంకుల్ భోజనం అయిపోయింది, కనక నాకేమీ పరవాలేదు” అంది నవ్వుతూ. మరో పదినిమిషాల తర్వాత శిశిర ఇచ్చిన పొగలు కక్కుతున్న కాఫీ తాగుతూ నెమ్మదిగా అంది ఆవిడ.

“ నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి, సరదాగా ఎక్కడికైనా వెళ్ళి మాట్లాడుకుందాం, ఎక్కడకెళదామో చెప్పు, మీ అంకుల్ రారు, నేనూ, నువ్వే అంది “నవ్వుతూ.

శిశిర నవ్వలేదు, మెత్తటి ఒత్తైన జుట్టుని ముడి వేసుకుంటూ నెమ్మదిగా అడిగింది, "అమ్మ ఫోన్ చేసిందా?" అని.

కొద్దిగా కంగారు పడింది జయంతి. "అదేం లేదు, ఊరికే నేనే మాట్లాడదామని,” అంది మరేమనాలో తోచనట్టు.

ఒక్క క్షణం మాట్లాడలేదు శిశిర. ఆ తర్వాత సాలోచనగా అంది "సరే ఆంటీ, రేపు శనివారం కదా, మధ్యాహ్నం సిటీ బయటకి డ్రైవ్ కి వెళదాం, దారిలో మాట్లాడుకుంటూ ఎక్కడైనా లంచ్ చేసి వద్దాం, సరేనా?”.

"సరే, పొద్దున్నే మీ అంకుల్ కి తైర్ సాధమే అయితే, కానీ నువ్విలా మూతి ముడుచుకుంటే కాదు, మామూలుగా, సరదాగా ఉంటేనే” అంది.

“అలాగే “అని ప్రయత్నపూర్వకంగా నవ్వింది శిశిర.

శనివారం జయంతి పూజ ముగించుకుని, పెరుగూ అన్నమూ, పులిహోరా కలిపి భర్త కోసం టేబిల్ మీద పెట్టేసి త్వరగా చీర మార్చుకుని జడ వేసుకుని వచ్చేసరికి శిశిరా తయారుగా ఉంది, జీన్స్, లేత నీలపు టాప్ వేసుకుంది, చక్కటి పెద్ద కళ్ళూ, మెత్తటి వత్తైన జుట్టూ, ఎప్పుడూ నవ్వుతూ ఉండే పిల్లా, ఆ అమ్మాయిని చూడగానే ఇష్టపడకపోవడం దాదాపు అసాధ్యం.

“ఇప్పుడు చెప్పండి ఆంటీ, అమ్మేం చెప్పింది మీతో? బుద్ధీ జ్ఞానం లేకుండా సందీప్ ని వద్దంటున్నానని చెప్పిందా? ఇంకా ఏం కంప్లైంట్స్ ఉన్నాయి నా మీద?” సిటీ లిమిట్స్ దాటేవరకూ మాట్లాడని శిశిర అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"ఛా, అలా ఎందుకంటున్నావు శీశీ? మీ అమ్మ సంగతి నీకు తెలియదూ?” అంది జయంతి.

"తెలుసు కనకే ఇలా అంటున్నాను, ఈ సారి కొంచం గట్టిగానే నవ్వింది శిశిర, నాకు ఇరవై ఆరేళ్ళున్నా ఇంకా చిన్నపిల్లనే అనుకుంటుంది అమ్మ, ఏమీ తెలియదనే తనకి గట్టి నమ్మకం, ఎప్పుడూ మేమెలా సుఖంగా ఉంటామో అన్న ఆలోచనే తప్ప తనగురించి పట్టదావిడకి, ఏదైనా చెప్తే చిన్నపిల్లలా అలుగుతుంది, నిన్న రాత్రి నాకూ ఫోన్ చేసి వినిపించింది విష్ణు సహస్రం. ముందావిడని ఎలా కన్విన్స్ చెయ్యాలో తెలీదు నాకు." తనలో తనే అనుకుంటున్నట్టుగా అంది.

" అసలేమైందో చెప్తావా? నిన్న రాత్రి ఫోన్ లో అమ్మ ఏడ్చినంత పని చేసింది అంటే విషయం పెద్దదే అయి ఉండాలి" అంది జయంతి గంభీరంగా.

"సందీప్ కి నాకు సరిపడదు ఆంటీ" క్లుప్తంగా అంది శిశిర.

"అది ఇప్పటికి చాలా సార్లు చెప్పావు, కానీ దానికో కారణం ఉండాలి కదా, అదేమిటో చెప్తే వినాలనే నిన్నిలా తీసుకుని వచ్చింది" అంది కొంత వ్యంగ్యంగా.

"మీరు వ్యంగంగా అన్నా, వెటకారం చేసినా నా సమాధానం ఇదే, అతనికీ నాకూ పడదు. అంత మాత్రాన అతను చెడ్డవాడు కాదు, వాళ్ళ అమ్మా, నాన్నా కూడా మంచివాళ్ళే, కానీ." అంటూ కళ్ళల్లోకి ఉబికి రాబోతున్న కన్నీటిని ఆపుకోవడానికి కాబోలు తల పైకి ఎత్తి సీలింగ్ వైపు చూడసాగింది.

ఆ అమ్మాయి మనసెందుకో బాగా గాయపడింది అని అర్ధం అయింది జయంతికి. "కాఫీయా, టీ యా ఏం చెప్పను?" అంది మాట మారుస్తూ.

"ఏదో ఒకటి చెబ్దాము కానీ ముందు మీరిది చెప్పండి. అమ్మ ఏమంది? దీనికెప్పుడూ తొందరే, ముందూ వెనకా చూడకుండా నిర్ణయాలు తీసుకుంటుంది, తనకెప్పుడు ఏది తోస్తే అది చేస్తుంది, మొండిది, అందా? ఇంట్లో ఫర్నిచర్, కర్టెనులూ అవీ మార్చినట్టు అనుకుంటుందా, పెళ్ళంటే? ఒక్క క్షణం కూడా ఆలోచించుకోవద్దా? అని చివాట్లేసిందా? తన బదులు మిమ్మల్ని కూడా వెయ్యమందా?" అంది ఆవేశంగా.

"అలా ఏమీ అనలేదు కానీ, ఎందుకిలా అంటున్నావో, ఎందుకు అంత పట్టుదలగా ఉన్నావో తెలియడం లేదు" అంది.

శిశిర ఏమీ మాట్లాడలేదు, చేతి గోళ్ళకి వేసుకున్న గులాబీ రంగు వైపు చూస్తూ కూర్చుంది.

"అసలు సంగతేమిటో చెప్పరా!" అనునయంగా అంది జయంతి .

" పెళ్ళి అయ్యాకా మా అమ్మ మాతో ఉండడానికి సందీప్ కి ఇష్టం లేదు, అమ్మ ఎక్కడకెళుతుంది ఇప్పుడు? రాజీవ్ ది సేల్స్ ఉద్యోగం, ఎప్పుడు ఎక్కడుంటాడో వాడికే తెలీదు. ఉన్నా పారిస్ లో చలికి అమ్మ తట్టుకోలేదు, ఇంతకుముందు రెండు సార్లు ఎంత బాధ పడిందో మనకే కాదు, తనకీ తెలుసు. అయినా సరే అలాగే అంటున్నాడు. నాకింతకన్నా ఎలా చెప్పాలో అర్ధం కావడం లేదు. అమ్మని వదులుకోలేను, మా గురించి అమ్మ ఎంత కష్టపడిందో నేను మర్చిపోలేను, " ఇలా ఒకదానికొకటి సంబంధం లేకుండా గజిబిజి గా చెప్తోంది.

విషయం కొంతవరకూ అర్ధం అయిన జయంతి అనునయంగా అంది " ఒక్క క్షణం ఊపిరి తీసుకో, నెమ్మదిగా చెప్పు, ఆ తర్వాత ఏం చెయ్యాలో ఆలోచిద్దాం ? అంది.

"ఆలోచించేందుకు ఏమీ లేదని నేను అనుకుంటున్నాను, ఈ మధ్యన తన పద్ధతి చాలా మారిపోయింది, ఇన్నేళ్ళుగా మాకు తెలిసిన వాడు, రాజీవ్ కి కూడా తను చాలా ముఖ్యమైన స్నేహితుడు. అన్ని విషయాలు తెలిసిన వాడు, అతనికి ఇంతకంటే ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి? నాకు అమ్మ కంటే ఏదీ ముఖ్యం కాదు ఆంటీ, సందీప్ ని నేను ఇష్టపడిన మాట నిజం, కానీ ఆ ఇష్టం అమ్మని నా నుంచి దూరం చేస్తే నేను అది భరించలేను " అంది స్థిరంగా.

జయంతికేం మాట్లాడాలో తెలియలేదు, కొన్ని క్షణాలు ఇద్దరి మధ్యనా మౌనం.

“అలా అనకు, కాస్త అతనివైపునించీ ఆలోచించు, అయినా అమ్మ ఇక్కడే ఉంటానంది కదా, నీకిబ్బందేముంటుంది చెప్పు? రాజీవ్ కావాలంటే వచ్చేస్తాను అంటున్నాడు కదా, తనకేం కావాలన్నా చూసుకోవడానికి మేమంతా లేమా? “ అంది.

" అసలంతవరకూ రావలసిన అవసరం ఏముందాంటీ? రాజీవ్ తనకి నచ్చిన ఉద్యోగం వదిలేసుకుని ఎందుకు రావాలి? ఇప్పుడు వచ్చేస్తే వాడు చదువు కోసం తీసుకున్న లోన్ ఎలా కడతాడు? రేపు తనకి వచ్చే అమ్మాయి అమ్మని బాగా చూసుకుంటుందని నమ్మకం ఏముంది? అసలు రాజీవ్ కీ, నాకూ తేడా ఎందుకుండాలి? ముందు లేని అభ్యంతరం ఇప్పుడెందుకుండాలి? ఎప్పుడో ఎవరూ లేని టైములో అమ్మకి ఆస్థ్మా ఏటాక్ వస్తే? ఊహించుకోవడానికే నాకు సాధ్యం కాదు.

మీరెన్నైనా చెప్పండి ఆంటీ, అమ్మని ఇబ్బంది పెట్టే పని నాకేదీ వద్దు, చివరికి అది నా పెళ్ళైనా సరే, మీకు చెప్పలేదు కదా, సందీప్ కి న్యూయార్క్ లో ప్రోజెక్ట్ వస్తోందిట, అక్కడకి వెళ్ళిపోదాం అని అంటున్నాడు. అప్పుడు అమ్మ అసలు నా దగ్గరుండలేదు కదా అక్కడ వాతావరణానికి, అదే మాట అంటే,

‘ఇన్నాళ్ళూ నువ్వే చూసుకున్నావు కదా, ఇప్పుడు రాజీవ్ చూసుకుంటాడు, వాడిని వచ్చేయమందాం’ అని తేలిగ్గా అనేశాడు, పైగా నేను మాత్రం మా అమ్మా, నాన్నలని వదిలే వెళ్ళాలి కదా, కొన్ని కావాలంటే కొన్ని వదులుకోవాలి శిశీ అన్నాడు. అతని వైపు నించి చూస్తే అది నిజమే కావచ్చు, కానీ అతని తల్లితండ్రులిద్దరూ కలిసి ఉంటారు, వాళ్ళకి కావలసినంత ఫామిలీ సపోర్ట్ ఉంది, కానీ అమ్మకి? “ అంది బాధగా.

గత మూడేళ్ళుగా ఆ అమ్మాయిని బాగా ఎరిగిన మనిషి గా మరేమీ అనలేకపోయింది. ‘ఎక్కడివాళ్ళో తనకింత దగ్గరయిపోయారు, ఏదైనా చేసి ఈ పిల్ల మనసు తాను మార్చగలిగితే ఎంత బాగుంటుందో కదా? తనకిలాంటి కూతురుంటే ఎంత బావుండేదో! అని ఎన్ని సార్లు అనుక్కుందో? ఈ అమ్మాయి పరిచయం అయినప్పటినించీ’. అసలు శిశిరా, వాళ్ళ అమ్మ మాధవి లతో పరిచయమే చిత్రంగా జరిగింది ఆవిడకి.

ఎనిమిది అంతస్థుల్లో నూట నలభై నాలుగు ఫ్లాట్ లు ఉన్న ఆ కాంప్లెక్స్ లో అందరూ చాలా స్నేహంగా ఉంటారు, ఎదురుపడినప్పుడు పలకరించుకోవడాలూ, దగ్గరలో ఉన్న ఫ్లాట్ల వాళ్ళకి చేసిన వంటలూ అవీ ఇచ్చి పుచ్చుకోవడాలు, పండగలకీ, పబ్బాలకీ కలవడాలూ వీటన్నింటితో ఎప్పుడూ సందడిగా ఉంటుంది. దానివల్ల ఒకరి వివరాలు మరొకరికి చాలా తొందరగా తెలుస్తాయి.

స్కూల్ టీచర్ గా పనిచేసి ఈ మధ్యనే రిటైర్ అయిన జయంతికి చాలా కాలంగా ఖాళీగా ఉన్న ఎదురింటి లోకి ఎవరో వస్తున్నరన్న వార్త వినగానే చాలా సంతోషంగా అనిపించింది.

శిశిరా, వాళ్ళ అమ్మా ఎదురుగా ఉన్న రెండు బెడ్రూంల ఫ్లాట్లోకి మారిన రెండో రోజునే ఆవిడ కాఫీ పట్టుకుని వెళ్ళి పరిచయం చేసుకుంది. ఎంతో కలివిడిగా ఉన్న ఆవిడని చూడగానే శిశిర అమ్మ మాధవికి ఎంతో దగ్గరవాళ్ళని చూసినట్టుగా అనిపించింది. క్రమంగా వాకింగ్ కీ, గుళ్ళకీ, బిల్డింగ్ లో జరిగే లలితా సహస్ర పారాయణాలకీ వెళ్ళడం, మధ్యహ్నం కలిసి టీ తాగడం ఇలా వాళ్ళ స్నేహం ఎంతో గాఢంగా మారింది తొందర లోనే.

జయంతి భర్త శేషగిరిరావు కొద్దిగా మూడీ మనిషి, ప్రధమ కోపం, ఎవరితోనూ కలవడానికి ఇష్టపడరు, పుస్తక పఠనం, ఒక్కరే కూర్చుని కంప్యూటర్ లో చెస్ ఆడుకోవడమూ ఆయనకెంతో ఇష్టం. టైము ప్రకారం అన్నీ జరిగినంతవరకూ ఆయనకేమీ ఇబ్బంది లేదు, ఎదైనా తప్పితే మాత్రం కోపం తొందరగా వచ్చేస్తుంది, అందుకని అక్కడదాకా రాకుండా జయంతి జాగ్రత్త పడుతూ ఉంటుంది.

జయంతీ, శేషగిరి రావులకి ముగ్గురు కొడుకులు, ఒక్కరూ ఇండియాలో ఉండరు, ఆయనకి ప్రయాణాలు పెద్దగా పడదు, అందుకని వాళ్ళు వెళ్ళడం తక్కువే.

మాధవికి శిశిరా, రాజీవ్ ఇద్దరు పిల్లలు. రాజీవ్ ఎం.బీ.యే చేసి పారిస్ లో ఉద్యోగం చేస్తున్నాడు. శిశిర కూడా ఈ మధ్యనే ఇంజనీరింగ్ పూర్తి చేసి కాంపస్ సెలెక్షన్లో ఐ.బీ.ఎం లో ఉద్యోగంలో చేరింది. ఇక్కడ తల్లీ, కూతురు మాత్రమే ఉంటారు, ఆవిడ భర్త గురించి జయంతి ఎప్పుడూ అడగలేదు, వీలైతే తోటివారికి సాయం చెయ్యడమే కాని వాళ్ళ వ్యక్తిగత విషయాల్లో వేలుపెట్టే అలవాటు ఎప్పుడూ లేదు ఆమెకి. ఆ అలవాటువల్లే ఆమె అంటే ఎంతో గౌరవం పెంచుకున్న శిశిర, జయంతి అంటే ఎంతో ప్రేమగా ఉండేది. మాధవివీ, జయంతివీ అభిరుచులూ, అభిప్రాయాలు బాగా కలవడమూ, ఎదురు బొదురు ఇళ్ళు కావడం వల్ల ఇద్దరూ చాలా సమయం కలిసే గడిపేవారు. అన్ని విషయాలు ఒకరితో ఒకరు చెప్పుకునేవారు.

ఒకరోజు పొద్దున్నించీ మాధవి కనిపించలేదు, మధ్యాహ్నం టీ టైముకి కూడా రాకపోయేసరికి ఏమైందా ?అని కంగారు పడింది. బెల్ కొట్టి చూద్దామని వెళితే ఇంటికి తాళం వేసి ఉంది, తనకి చెప్పకుండా ఎక్కడకీ వెళ్ళదు, ఏమై ఉంటుందా? అని సెల్ ఫోన్ కి చేస్తే "స్విచ్ ఆఫ్" అంది. శిశిర కి చేస్తే, " అమ్మ బయటకి వెళ్ళింది ఆంటీ, సాయంత్రం వస్తుంది, మీటింగ్ లో ఉన్నాను, సాయంత్రం కలుస్తాను, బై “ అని హడావిడిగా ఫోన్ పెట్టేసింది.

సాయంత్రం ఇద్దరూ కలిసి వచ్చారు, అలిసిపోయినట్టున్న మాధవి ని చూసి ఇంకేమీ పలకరించలేదు. ఆ తర్వాత కూడా మాధవి మాట్లాడలేదు, బయటకి రాలేదు.

రాత్రి శిశిర వచ్చింది, “రామ్మా, మీ ఆంటీ లోపల్ ఉంది వెళ్ళు ‘అంటూ,” జయా, శిశిర వచ్చింది “అని పిలిచాడు శేషగిరి రావు.

అప్పుడు చెప్పింది అసలు విషయం..

“ ఈ రోజు అమ్మ మర్చిపోలేని రోజు, దురదృష్టవశాత్తూ మంచికి మాత్రం కాదు” అంటూ ఒక్క క్షణం ఆగింది.

“ నాన్న అమ్మనీ, మమ్మల్నిద్దరినీ వదిలేసి వెళ్ళిపోయిన రోజు, అందుకని ఈ రోజు అమ్మ ఇంటికి దూరంగా గుడిలోనో, ఏదైనా ఆశ్రమంలోనో గడుపుతుంది, అక్కడ సేవ చేస్తుంది, మరే విషయమూ గుర్తుకురానంత బిజీగా గడుపుతుంది. బాగానే ఉండేవారు ఇద్దరూ, అమ్మకి చిన్నప్పటినించీ విపరీతమైన ఆస్థ్మా ఉంది, నాన్నకీ ఆవిషయం తెలుసు, పెళ్ళప్పుడు చెప్పే చేశారుట తాతగారు వాళ్ళు, దానివల్ల నాన్న అప్పుడప్పుడూ విసుక్కునేవారుట.

ఆఫీస్ లో పరిచయం అయిన సరళ అనే ఆవిడంటే ఇష్టం, నీకూ, పిల్లలకీ అన్యాయం చెయ్యను, అప్పుడప్పుడూ వస్తూనే ఉంటాను, డబ్బు పంపుతాను, అంటే అమ్మ భరించలేకపోయింది. వద్దంది, అలిగింది, బ్రతిమాలింది, అయినా ఆయన తన నిర్ణయం మార్చుకోలేదు. “ నీకిష్టమున్నా లేకపోయినా నేను సరళని పెళ్ళి చేసుకునేది ఖాయం, నువ్వు సర్దుకుంటానంటే ఇక్కడే ఉండవచ్చు, లేదంటే నీ ఇష్టం” అని ఆయన ఖరాకండీగా చెప్పారుట, నాకు చాలా కొద్దిగా గుర్తుంది.

అమ్మ అభిమానం గాయపడింది, మమ్మల్నిద్దరినీ తీసుకుని ఇంట్లోంచి వచ్చేసింది. అప్పటినించీ ఎవరిమీదా ఆధారపడకుండా రకరకాల చిన్న, చిన్న ఉద్యోగాలు చేస్తూ మమ్మల్ని పెంచింది, అలా చేస్తూనే బీ.ఈ.డీ చదివి స్కూల్ లో టీచర్ గా ఉద్యోగం సంపాదించుకుంది. అది రాకముందు సూపర్ బజార్లో సేల్స్ పనీ, ఇంట్లో వాయిదాల పద్ధతిమీద చీరలు అమ్మడం, చివరికి ఒక కంపెనీలో సెక్యూరిటీ గార్డ్ గా కూడా కొన్ని రోజులు పనిచేసింది. డ్యూటీ పగలైనా, రాత్రైనా నన్నూ, అన్నయ్యని కంటికి రెప్పలా చూసుకునేది. అంత

ధైర్యం ఎలా వచ్చిందో? ఎలా అన్ని పనులూ చూసుకునేదో? అని తలుచుకుంటేనే ఇప్పుడు నాకు ఆశ్చర్యం వేస్తుంది ఆంటీ, ఐ ఆం రియల్లీ ప్రౌడ్ ఆఫ్ మై మదర్, అందుకే తనకే కష్టమూ కలగకుండా చూసుకోవాలని మా ఇద్దరి ఆశ.

ఈ రోజు మాత్రం తను ఒక్కర్తీ తెలియని వారి మధ్య ఉండడాన్ని ఇష్టపడుతుంది, ఎందుకో తెలీదు, ఎన్నో ఏళ్ళనించి ఇలాగే. మా ముగ్గురిలో ఎవరికైనా వంట్లో బావులేకపోతే తప్ప, అమ్మ సెలవు పెట్టేది ఈ ఒక్క రోజే. ఇన్నేళ్ళల్లో చాలామంది కలిశారు అమ్మ ఈ ప్రయాణంలో, కానీ మీ అంత దగ్గరగా వచ్చిన వారు బహుశా మరెవరూ లేరు.  నేరుగానే అడిగినవారూ ఉన్నారు, వీసమెత్తు సాయం చెయ్యకపోయినా వెనక చెవులు కొరుక్కున్న వారూ ఉన్నారు. మీ మంచితనమూ, స్నేహంగా ఉండే గుణమే కాక మీరు తన వ్యక్తిగత జీవితం గురించి ఎప్పుడూ పరోక్షంగానైనా ప్రస్తావించకపోవడం ఒక కారణం కావచ్చు, మీరంటే తనకున్న అభిమానానికి. అలాంటి మీరు అమ్మ మీకేమీ చెప్పలేదు అని అనుకోకూడదనే, మీకు చెప్దామనే ఇలా వచ్చాను, విషయం మీకు చెప్పాలని ఇలా వచ్చాను, ఎందుకంటే అమ్మ ఎంతో ఇష్టపడే మీరు ఆమె గురించి మరేమీ అనుకోకూడదు అందుకే. యూ నెవర్ జడ్జెడ్ హర్.. ఐ రెస్పెక్ట్ యూ సో మచ్ ఫర్ దట్.”  అంది ఉద్వేగంగా.

ప్రశాంతంగా అంతా విన్న జయంతి ఆప్యాయంగా శిశిర చెయ్యి నొక్కింది.

"ఓ అవునా, మీ అమ్మ ఎంతో అదృష్టవంతురాలమ్మా, మీ లాంటి పిల్లలున్నందుకు, అందరికీ జీవితంలో అన్నీ ఉండవు కదా, నౌ ఐ అడ్మైర్ హర్ మోర్ దాన్‌ఎవర్” అంది చిరునవ్వుతో. అంతేకానీ మరింకే విషయాలూ అడగలేదు.

ఆ సంఘటన జరిగిన తర్వాత ఆ రెండు కుటుంబాల మధ్య స్నేహం మరింత బలపడింది. శేషగిరి రావు కూడా శిశిర పట్ల ప్రేమగా ఉండేవాడు, రాజీవ్ వచ్చినప్పుడు పండగ వాతావరణం ఆ ఇళ్ళల్లో. మారుతీ స్విఫ్ట్ కార్ కొంది శిశిర. రాజీవ్ పోరు పడలేక అక్కడ వేసవి కాలం ఉన్నప్పుడు ఒక నెలా, రెండు నెలలకి పారిస్ వెళ్ళేది మాధవి. ఆమె కున్న ఉబ్బసం వల్ల అక్కడ ఎక్కువరోజులుండడం సాధ్యమయ్యేది కాదు, అదీ కాక రాజీవ్ సేల్స్ ఉద్యోగం వల్ల ఎక్కువగా టూర్ల లో ఉండేవాడు. అందుకని తొందరగానే వచ్చేసేది.

“ఆంటీ లంచ్ వచ్చింది “ అంది శిశిర జయంతి ఆలోచనలకి బ్రేక్ వేస్తూ.

" ఓ అవును కదూ, దా ఓ పట్టు పడదాం, ఆకలి వేస్తోంది" అంది నవ్వుతూ. నాన్ ముక్క తుంచి నోట్లో పెట్టుకుంటూ అంది

" ఇప్పుడు చెప్పండాంటీ, నేను చేస్తున్నది తప్పా, కరక్టా?  నా కున్న ఆలోచనలకీ,బాధ్యతలకీ సందీప్ ని ఎందుకు బందీ ని చెయ్యాలి, తన కలలకీ, ఆశలకీ నేనెందుకు అడ్డం పడాలి? ఒక మనిషిని ఇష్టపడటం వేరు, దానికేమీ ఆలోచన అక్కర్లేదు, అసంకల్పితంగానూ, అప్రయత్నంగానూ జరిగిపోతుంది, కానీ వివాహమనే బంధంలోకి అడుగుపెట్టాలంటే ఎంతో ఆలోచించాలి? కలిసి కాఫీ కి వెళ్ళినంత సులభం కాదు కదా కలిసి బ్రతకడం, అందుకే సందీప్ కి నాకూ కుదరదని నా అభిప్రాయం, “ అంది.

జయంతి మౌనంగా ఉండిపోయింది. కేవలం తన వైపునించేకాకా అతనికి కలిగే అసౌకర్యాన్ని కూడా బేరీజు వేసుకుంటూ నిర్ణయాన్ని తీసుకుంటున్న ఆ చిన్న పిల్లని చూస్తే ఎంతో ముచ్చట వేసింది. అది సరైనదా, కాదా? అన్నది పక్కన పెడితే, ఆ అమ్మాయి అన్ని కోణాల్లోంచి ఆలోచిస్తున్న తీరు ఆమెకెంతో నచ్చింది.

"  చెప్పండాంటీ? మాట్లాడరేం? నాకు తెలుసు మీరిప్పుడు ఎందుకు మాట్లాడటం లేదో? రాత్రి అమ్మ ఫోన్ చేస్తుంది కదా, అప్పుడు చేస్తారు గూడుపుఠానీ, రెండు వారాల్లో ఎలాగూ వస్తుంది కదా, అప్పుడు కలిసి సాధిద్దాం అనుకుంటున్నారు కదూ “ అంది చిరుకోపంగా.

"లేదు, లేదు శిశీ, ఈ సమస్యని ఎలా పరిష్కరించవచ్చా ?అని ఆలోచిస్తున్నాను అంతే, అయినా ఇప్పటివరకూ ఆవేశపడి చాలా అలిసిపోయావు, ఇది ఒక్క డిస్కషన్ తో తెగే వ్యవహారం కాదు, చూద్దాం కొంత టైము ఇచ్చి, “అంది తనూ సాలోచనగా.

నిజానికి జయంతి ఆలోచిస్తున్నది కేవలం శిశిర గురించి మాత్రమే కాదు, ఒక కూతురిగా, అమ్మనెంతో ప్రేమించిన పిల్ల గా తాను నెరవేర్చలేకపోయిన బాధ్యత గురించి.

జయంతీ వాళ్ళు ముగ్గురు పిల్లలు, ఇద్దరన్నయ్యల తర్వాత పుట్టిన ఆడపిల్లని ఎంతో గారాబంగా చూసేవారు జయంతి అమ్మా, నాన్నా. అన్నయ్యలిద్దరూ  కూడా కోరిందే తడవు అన్నీ సమకూర్చేవారు. అలా ఎంతో అల్లారుముద్దుగా పెరిగింది ఆవిడ.

బి.ఏ పూర్తి అవగానే స్కూల్ లో ఉద్యోగమూ, అది వచ్చిన రెండు నెలలకే శేషగిరిరావు తో పెళ్ళీ జరిగిపోయాయి. శేషగిరి వాళ్ళది పెద్ద కుటుంబం, నలుగురన్నదమ్ములూ, తల్లీ తండ్రీ అందరూ కలిసి ఉండే ఉమ్మడి కుటుంబం. పొద్దున్న లేస్తే విపరీతమైన పని కోడళ్ళందరికీ, జయంతి ఒక్కర్తే ఉద్యోగం చేసేది అయినా ఆమె వంతు పని ఆమె కోసం వేచే ఉండేది ఏ వేళప్పుడైనా. ఆమె పెళ్ళి అయిన రెండు సంవత్సరాలకి తండ్రి పోవడంతో తల్లి, ఇద్దరు అన్నయ్యల ఇళ్ళ మధ్యా తిరుగుతూ ఉండేది. ఆస్థి తమ ఇద్దరికీ సమానంగా పంచి ఇచ్చినా సరే, తన బంగారమంతా కూతురికి ఇచ్చిందన్న కారణం వల్ల వదినలిద్దరికీ ఆవిడంటే కోపంగా ఉండేది, దాన్ని ఎలాగోలా వ్యక్తపరుస్తూనే ఉండేవారు.

అది గమనించి తను" ఉన్నదేదో ముగ్గురం తీసుకుందాం" అని జయంతి అంటే ,

"వద్దులేమ్మా, మీ అమ్మగారికి ఉండాలి కానీ, ఇప్పుడు నువ్వివ్వడమెందుకు? మాకున్నవేవో మాకూ ఉన్నాయి" అని వెటకారంగా అనేవారు. వదినల నిరాదరణ వల్ల ఇబ్బంది పడుతున్న తల్లిని తన దగ్గర ఉంచుకోవాలని, ఆవిడ చిన్నప్పుడు తనని చూసుకున్నట్టు చూసుకోవాలని మనసంతా ఉన్నా జయంతికి కుదిరేది కాదు, ఉమ్మడి కుటుంబపు పరి మితులే కాక, పాత కాలపు భావాలతో పెరిగిన భర్త కూడా " మీ అమ్మ మనింట్లో ఉండడమేమిటి? మీ అన్నయ్యలుండగా? చూసినవాళ్ళేమనుకుంటారు? నాతో అన్నావు కానీ ఇంట్లో ఇంకెవరితోనూ అనకు "అని తేలిగ్గా కొట్టిపారేసేవాడు.

సంపాదిస్తున్నా కూడా తగినంత ఆర్ధిక స్వాతంత్ర్యం లేక ఆమె కోరిక తీరలేదు. ఎప్పుడైనా చూడటానికి వెళ్ళినప్పుడు ఆవిడకిష్టమైన పళ్ళో, స్వీట్లో పట్టుకెళ్టే అసలే నోరు పెద్దదైన చిన్న వదిన" ఆ మాత్రం మేమూ పెట్టగలం లే జయా, నువ్వేమీ కష్టపడి మోసుకుని రానక్కరలేదు" అంటూ చిన్నతనంగా మాట్లాడేది. దాంతో ఆవిడ అక్కడి విషయాలెలా ఉన్నా సరే ఏమీ చెప్పేది కాదు, "పోనీలేమ్మా, నువ్వొచ్చావు చూడటానికి అంతే చాల్లే, మీ వదినల సంగతి తెలిసి ఎందుకు అల్లరి పడటం? అనేది.

అలా జయంతి కోరిక తీరనే లేదు, తండ్రి పోయాకా దాదాపు పదేళ్ళు కొడుకులిద్దరి ఇళ్ళలో ఏమి జరిగినా చెప్పకుండానే ఎనభై ఏళ్ళ వయసులో కన్ను మూసిందావిడ. అది గుర్తుకు వచ్చి జయంతికి మనసంతా కలచివేసినట్టయింది.

" ఎందుకు తనేమీ మాట్లాడలేకపోయింది? చదువుకుని ఉద్యోగం చేస్తూ కూడా ఓ నాలుగు నెలలు  అమ్మని నేను చూసుకుంటాను అని ఎందుకు చెప్పలేకపోయింది?" అని ప్రశ్నించుకున్నప్పుడల్లా ఆమెకి అంతులేని ఆవేదన కలుగుతుంది. "ఈ రోజుల్లో పిల్లల భావాలూ, సమర్ధతా, ఆత్మ విశ్వాసమూ తమకెందుకు ఉండేవి కావు? "ఈ ప్రశ్నలకి ఆమె దగ్గర ఇప్పటికీ సమాధానం లేదు.

"ఏమయిందాంటీ? మౌనాన్ని భోంచేస్తున్నరా? అస్సలు మాట్లాడటం లేదు, నేనేదైనా తప్పుగా మాట్లాడానా? "అంది శిశిర చిరునవ్వుతో.

" లేదు తల్లీ, మనసులో ఉండిపోయిన నిన్నటి ఊసులు ఒక్కసారిగా బయటకి వచ్చాయి, నేడు మీకున్న కాన్ఫిడెన్స్ లో కానీ, ధైర్యంలో కానీ మాకు ఆనాడు సగమున్నా ఎన్నో విషయాలు ఎంతో వేరుగా జరిగి ఉండేవేమో అని అనిపించి.." అంది సగంలోనే ఆపుతూ.

రాత్రి మాధవి ఫోన్ చెయ్యగానే " శిశి మనసు బాధపెట్టే పని నువ్వేమీ చెయ్యద్దు మాధవీ! ఎందుకంటే తర్వాత తను బాధ పడితే ప్రయోజనమేమీ ఉండదు, సందీప్ నిజంగా తనకి జోడు అని నువ్వు అనుకుంటే మాత్రం, వాళ్ళిద్దరినీ కలపడానికి  మనం వేరే దిశగా

ఆలోచిద్దాం, తను మనస్పూర్తిగా ఒప్పుకునేవరకూ ప్రయత్నిద్దాం  అంతే కానీ నువ్వు మాత్రం బలవంతం చెయ్యకు.  ఒక్క విషయం చెప్పనా? అలాంటి కూతురున్నందుకు నువ్వు నిజంగా గర్వపడాలి. మన శశి నిజంగా బంగారు తల్లి, నువ్వనుకునేట్టుగా తాపట్టిన కుందేలుకి మూడే కాళ్ళు అనుకునేంత మొండిపిల్ల మాత్రం అస్సలు కాదు, నిర్ణయమేదైనా మాత్రం, అది తనదీ, తన మనసుకు నచ్చినదీ అవ్వాలి అంతే,  మిగతా విషయాలు నువ్వొచ్చాకా మాట్లాడదాం" అంది.

●●●

Click here to share your comments on this story